క్లుప్తంగా

భద్రాచలంలో 'హైడ్రా' తరహా కమిటీ?

భద్రాచలంఅర్బన్: ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలందరూ వింటున్న పేరు హైడ్రా. ప్రస్తుతం హైదరాబాద్ కేంద్రంగా నాలాల ప్రాంతాల్లో కట్టడాలను కూల గొడుతున్న విషయం తెలిసిందే. అయితే ఇదే తరహాలో భద్రాచలం పట్టణంలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూములు, స్థలాలను రక్షించాలని భావనలో అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది. సోమవారం భద్రాచలం గోదావరి నది తీరంలో ఏర్పాటు చేసిన నిమజ్జన ఘాట్ వద్ద ఈ మేరకు అధికారులు చర్చించుకుంటున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా ఇప్పటికే పలువురు రోడ్ల వెంబడి ఉన్న ప్లాట్‌ఫారమ్‌ను కబ్జా చేసి, వాటిని తొలగించాలని సంబంధిత అధికారులు చెప్పినప్పటికీ వారి మాటలను ఖాతరు చేయలేదు. ఇదే విధంగా ఆదివారం సాయంత్రం రోడ్డుని కబ్జా చేసి వ్యాపారం చేస్తున్న వ్యక్తి బడ్డీని తొలగించేందుకు ప్రయత్నించిన గ్రామ పంచాయతీ సిబ్బందితో వాగ్వాదానికి దిగాడు. ఈ నేపథ్యంలో హైడ్రా తరహా కమిటీని భద్రాచలంలో కూడా ఏర్పాటు చేసుకోవాలని అధికారులు చర్చించుకున్నారని సమాచారం.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ములకలపల్లి: మండలపరిధిలోని కమలాపురంతోపాటు పలుగ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అందజేశారు. క్షేత్రస్థాయిలో పర్యటించి, లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి చెక్కులను పంపిణీ చేశారు. మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, మాజీ సర్పంచ్ కారం సుధీర్, మాజీ ఎంపీపీ మట్ల నాగమణి, బాల అప్పారావు, శనగపాటి రవి, తన్నీరు నాగయ్య, నున్నా జగదీష్, నల్లమోతు జగదీశ్, మాచినేని మునీశ్వరరావు ఉన్నారు.

వినాయకుడి కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న ఇరిగేషన్ అధికారులు

దుమ్ముగూడెం: మండలంలోని వర్క్‌షాప్ దగ్గర ఉన్న హెడ్‌లాక్‌ల వద్ద స్వయంభువుగా ఏర్పడిన రత్నాల గణపతి ఆలయంలో వినాయక నవరాత్రులలో భాగంగా స్వామి వారికి సోమవారం కల్యాణం నిర్వహించారు. ముందుగా అర్చకులు ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం ఆలయం ప్రాంగణంలో కల్యాణతంతు కార్యక్రమం అంగరంగవైభవంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కల్యాణంలో ఇరిగేషన్ ఈఈ హెచ్‌వీ.రాంప్రసాద్ దంపతులు, డీఈ మధుసూదన్‌రావు దంపతులు, జేఈ రాజ్‌సుహాస్, పీటీ మస్తాన్ వలీ, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

భద్రాచలంఅర్బన్: పరివర్తన యశోద ఫౌండేషన్ భద్రాచలం కమిటీ ఆధ్వర్యంలో సోమవారం వృద్ధులకు, వికలాంగులకు అన్నాదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భద్రాచలం లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు భీమవరపు వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ.. పరివర్తన యశోద్ ఫౌండేషన్ నిర్వాహకులు కొమ్మగిరి యశోద పుట్టినరోజు సందర్భంగా ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని, గడిచిన 27 ఏళ్లుగా ఎంతో మంది వికలాంగులకు ఈ సంస్థ ఆధ్వర్యంలో సేవలందిస్తున్నారని ఆయన తెలిపారు. డాక్టర్ భానుప్రసాద్, అరికెళ్ల తిరుపతిరావు, అల్లం నాగేశ్వరరావు మాట్లాడుతూ.. యశోద సేవలను కొనియాడారు. పరివర్తన యశోద ఫౌండేషన్ సభ్యులు అప్పలదాసు, జాన్‌బాబు, బొక్క పున్నమయ్య, కనుకవాసు, కిషన్, నవీన్, అలవాల రాజా, కొప్పుల నాగమణి పాల్గొన్నారు.

క్వారీల్లో దొంగతనాలను అరికట్టాలి

మణుగూరుటౌన్: ఏరియాలో వరుసగా క్వారీల్లో జరుగుతున్న కేబుల్ దొంగతనాలను అరికట్టడంలో యాజమాన్యం విఫలం చెందిందని ఏరియా టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి ఆరోపించారు. సోమవారం ఆయన ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడంలో అధికార యంత్రాంగం పర్యవేక్షణ లోపం వల్ల లక్షలాది విలువైన కేబుళ్లు దొంగల పాలవుతున్నాయన్నారు. సెప్టెంబర్ మాసంలో ఐదుసార్లు దొంగతనాలు జరిగినట్లు కార్మికుల నుంచి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయని ఆరోపించారు. గస్తీలను పెంచి ఆస్తులను కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు.

దరఖాస్తుల స్వీకరణ

దమ్మపేట: మండలంలోని గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో సోమవారం ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సమస్యలు, అభివృద్ధి, వ్యక్తిగత సమస్యలపై ప్రజల నుంచి ఎమ్మెల్యే జారె ఆదినారాయణ దరఖాస్తులు స్వీకరించారు.

భై.. భై గణేషా..!

ప్రజలు నియమనిష్టలతో, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునే గణేశ్ చతుర్థి నవరాత్రులు పూర్తి చేసుకోవడంతో సోమవారం గణపతి విగ్రహాలను నిమజ్జనం చేశారు. అంతకుముందు పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. లడ్డూ వేలం పాటలు వేశారు. వీధుల గుండా డప్పు చప్పుళ్లు, నృత్యాలతో విగ్రహాలను ఊరేగించారు. గణపతిబప్పా మోరియా.. అంటూ నినాదాలు చేశారు. ఆపై నిమజ్జనాలు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



మణుగూరుటౌన్: కూరగాయల మార్కెట్ వ్యాపారుల ఆధ్వర్యంలో గణనాథుని ఊరేగింపు



అశ్వారావుపేటరూరల్: తిరుమలకుంటలో నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే జారే



చంద్రుగొండ: గణనాథుడి నిమజ్జనం సందర్భంగా భక్తుల కోలాహలం



దుమ్ముగూడెం: కే లక్ష్మీపురం గ్రామంలోని విగ్రహం ఊరేగింపులో గ్రామస్తులు



చర్ల: గణేషుడి శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం



అన్నపురెడ్డిపల్లి: వినాయకుడి శోభాయాత్రలో యువత నృత్యాలు



అశ్వారావుపేటరూరల్: దేవతామూర్తుల వేషధారణలో కళాకారులు

ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు

భద్రాచలంఅర్బన్: మిలాద్ ఉన్ నబీ వేడుకలు భద్రాచలంలోని ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా భద్రాచలం కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ ఆధ్వర్యంలో సోమవారం భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పరిమి శ్రీనివాస రావు, పట్టణ అధ్యక్షుడు అలీమ్,సీనియర్ నాయకులు బంధం. శ్రీనివాస్ గౌడ్, మైనారిటీ సెల్ జిల్లా ప్రెసిడెంట్ మహమ్మద్ ఖాన్, ఎండీ హరీఫ్, ఎండి.బాబ్జి, ఉస్మాన్, పాషా షారుద్దీన్,తమ్మళ్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కరకగూడెం: మహమ్మద్ ప్రవక్త అడుగుజాడల్లో యావత్ ముస్లిం సమాజం నడుస్తున్నదని కరకగూడెం జామా మస్జీద్ మౌలానా మొహమ్మద్ ఫిరోజ్ పేర్కొన్నారు.ఈ మేరకు ఆయన సోమవారం 'మిలాద్ ఉన్ నబీ' పండుగను పురస్కరించుకుని స్థానిక మస్జీద్‌లో ప్రవక్త సందేశాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రవక్త బోధనలు యావత్ ప్రపంచాన్ని ప్రభావితం చేసాయని పేదలు,అనాథలు, స్త్రీలు, వృద్ధులపట్ల ఆయన చూపిన కరుణ, గౌరవం వంటి లక్షణాలు నేటికి అనుసరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ముస్లింలు పాల్గొన్నారు.



భద్రాచలంఅర్బన్: ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

మహాసభల పోస్టర్లు ఆవిష్కరణ



సభల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జమలయ్య, నాయకులు

భద్రాచలంఅర్బన్: కొత్తగూడెంలో ఈనెల 22, 23వ తేదీల్లో జరగనున్న ఆటో, క్యాబ్, ప్రైవేట్ మోటార్ డ్రైవర్ల యూనియన్ రాష్ట్ర మూడో మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు కంచర్ల జమలయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు సభల పోస్టర్లను భద్రాచలంలో సోమవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్మికులకు రూ.12వేలు చెల్లించడమే కాక 019 మోటార్ వాహనాల చట్టాన్ని రద్దు చేయండం తదితర డిమాండ్లపై చర్చించి కార్యాచరణ రూపొందించనున్న మహాసభలను అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నరాటి ప్రసాద్, కల్లూరి వెంకటేశ్వరరావు, కె.వెంకటేశ్వర్లు, వేల్పుల మల్లికార్జునరావు, సాధనపల్లి సతీష్, కంబంమెట్టు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ్ మృతికి రేగా సంతాపం

మణుగూరురూరల్: మండలంలోని కూనవరం గ్రామపంచాయతీ బావికూనవరం గ్రామానికి చెందిన బుర్క కల్యాణ్ ఆత్మహత్య చేసుకుని మరణించాడు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు సోమవారం వారి గృహానికి వెళ్లి కళ్యాణ్ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కళ్యాణ్ మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ.. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, బీఆర్ఎస్ నాయకులు వట్టం రాంబాబు, ముద్దంగుల కృష్ణ, నూకారపు రమేష్, వల్లభనేని రమణ, సకిని బాబురావు, మడి వీరన్నబాబు, ఉప్పుతల రామారావు, వంకా సూరయ్య, బర్ల సురేష్, మూస తదితరులు ఉన్నారు.

దందా మళ్లీ మొదలైందా..?



సత్యంపేట శివారులోని నిర్మానుష్య ప్రదేశంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక

ములకలపల్లి: ములకలపల్లిలో ఇసుక దందా మళ్లీ మొదలైందా.. అంటే అవును అన్నట్లుగానే ఉంది ప్రస్తుత పరిస్థితి. సత్యంపేట గ్రామశివారులోని నిర్మానుష్య ప్రదేశంలో ఇసుక అక్రమంగా నిల్వ చేయడం చూస్తుంటే స్థానిక పరిస్థితులను తేటతెల్లం చేస్తున్నాయి.

సంజీవ్‌పల్లి గ్రామ శివారులో ఇసుక అక్రమంగా నిల్వ చేయగా.. ఆగస్టు రెండో వారంలో రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన విషయం విధితమే. ఈ క్రమంలో మండలంలో సాగుతున్న ఇసుక మాఫియా వ్యవహారం బయటికి పొక్కింది. సత్యంపేట, కొత్తూరు గ్రామ శివార్లోని సీతారామ కాలువ సమీపంలో ఇసుక డంప్ ప్రదేశాలు, వీకే, రామవరం వద్ద ఇసుక నిల్వ చేసే తావులు బయటికి వెలుగు చూశాయి. సమీప వాగుల నుండి ట్రాక్టర్లతో అనుకూల ప్రదేశాల్లో డంప్‌చేసి, గుట్టుచప్పుడు కాకుండా లారీల్లో బైటికి తరలిస్తున్నారు. ఈ అంశాలపై పోలీస్, రెవెన్యూ శాఖ అధికారులు దృష్టి సారించడంపై కొన్నాళ్లుగా తోలకాలు నిలిచిపోయాయి. దీనికి తోడు విస్తారంగా వర్షాలు కురువడంతో వాగులు ఉధృతంగా ప్రవహించడంతో, రవాణా కష్టంగా మారింది. ఇలా ఇన్నాళ్లు ఆగిన అక్రమ రవాణా మరలా మొదలైనట్లు సమాచారం. సత్యంపేటతోపాటు పలుచోట్ల ఇసుక నిల్వ చేసి అక్రమ తరలింపుకు సన్నాహాలు చేస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. సంబంధితశాఖ అధికారులు దృష్టి సారించి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని స్థానికులు కోరుతున్నారు.

అంబులెన్స్‌ల నిర్వహణకు టెండర్లు ఆహ్వానం

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని సింగరేణి వైద్యశాలలో ఏసి అంబులెన్సుల నిర్వహణ కోసం టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు ఏరియా డీజీఎం (పర్సనల్) ఎస్.రమేష్ తెలిపారు. సోమవారం ఆయన తన చాంబర్‌లో మాట్లాడుతూ... సింగరేణి ఏరియా ఆస్పత్రికి సంబంధించి రెండు ఏసీ అంబులెన్సులు నడపాల్సిన అవసరం ఉందన్నారు. ఐదు సంవత్సరాల కాలపరిమితితో నెలకు వెయ్యి కిలోమీటర్ల చొప్పున ప్రతి రోజూ 24గంటల పాటు సేవలందించాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 26వ తేదీ సాయంత్రం 4.30గంటల లోపు ఈ అంబులెన్సుల నిర్వహణ టెండర్ల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓసీ ప్రభావిత, నిర్వాసితులకు తొలి ప్రాధాన్యత, సింగరేణి మాజీ ఉద్యోగులకు, మిగతా వారికి ఆ తర్వాత ప్రాధాన్యత కల్పించడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల వారు తగిన ధ్రువీకరణ పత్రాలు, ఆధారాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు ఏరియా పర్చేస్ విభాగంలో సంప్రదించాలని సూచించారు.

భద్రాచలం వాసి నేత్రదానం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని తాతగూడి సెంటర్ లో నివాసం ఉండే చలవాది. మురళి కృష్ణ (75) సోమవారం అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా అతని కుమారుడు చలవాది హరికృష్ణ మరోకరికి చూపునివ్వాలనే ఉద్దేశ్యంలో మురళి కృష్ణ రెండు నేత్రాలను హెదరాబాద్‌కు చెందిన అగర్వాల్ ఐ బ్యాంక్ సంస్థ రిప్రెసెంటేటివ్ జానీకి అందజేశారు. కాగా ఈ రెండు నేత్రాలను 4 రోజుల లోపు అవసరమున్న వ్యక్తులకు వీటిని దానం చేస్తామని జానీ తెలిపారు. భద్రాచలం పరిసరాలలో ఉండే ప్రజలు తమ కుటుంబ సభ్యులు మృతిచెందితే.. అనంతరం ఎవరైనా సదరు వ్యక్తుల నేత్రాలను దానం చేయాలనుకునే వారు 7288084777 నంబర్‌ను సంప్రదించాల్సిందిగా ఆ సంస్థ బాధ్యుడు జానీ తెలిపారు.

వైద్యశిబిరం ఏర్పాటు

దుమ్ముగూడెం: మండలంలోని సర్వాపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని డి కొత్తగూడెం గ్రామంలో డాక్టర్ సుభాష్ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో జ్వర పీడితులని పరీక్షించి వారికి మందులు పంపిణీ చేశారు. ఇంటింటి సర్వే చేపట్టి డ్రై డే కార్యక్రమంను నిర్వహించారు. డ్రైడే కార్యక్రమంలో భాగంగా దోమల లార్వా ఉన్న నిలువ నీరు గుర్తించి తొలగించారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించారు. గర్భిణులను పరీక్షించి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని ఆసుపాక గ్రామంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు సోమవారం ముగిశాయి. పోటీల్లో పాల్గొన్న ఆటగాళ్లు ఉత్తమ ప్రతిభను ప్రదర్శించారు. ముగింపు కార్యక్రమానికి అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ హాజరై, పోటీల్లో గెలుపొందిన విజేతలకు నగదు బహుమతులు, జ్ఞాపికలను అందించారు.

కొత్తగూడెంలో వెదురు ఉత్పత్తుల స్టాల్

చంద్రుగొండ: జిల్లాకేంద్రం కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో మండలంలోని బెండాలపాడు కేంద్రంగా ఉన్న బ్యాంబో ఉత్పత్తుల స్టాల్‌ను సోమవారం ఏర్పాటు చేశారు. ఈ స్టాల్‌ను కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావులు సందర్శించి వెదురు ఉత్పత్తులను పరిశీలించారు. కొత్తగూడెంలో ఇప్పటికే వ్యవసాయ అనుబంధ ఉత్పత్తుల ప్రదర్శన చేస్తున్నారు. ఇదిలా ఉండగా గడిచిన ఆదివారం కలెక్టర్ జితేష్ వి.పాటిల్ చంద్రుగొండ మండలంలోని బెండాలపాడు శివారులో ఉన్న కనకగిరి గుట్టలను, ఈ ప్రాంతంలోనే ఉన్న బ్యాంబో క్లస్టర్‌ను సందర్శించిన విషయం విధితమే. కలెక్టర్ సూచన మేరకు బ్యాంబో క్లస్టర్ బాధ్యులు వెదురు ఉత్పత్తుల స్టాల్‌ను కొత్తగూడెంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో క్లస్టర్ చైర్మెన్ వీసం నాగభూషణం, మల్లం కృష్ణయ్య, బొర్రా సురేష్, కారం అన్వేష్, రేసు సురేందర్, బడుగు దేవదాసు పాల్గొన్నారు.



స్టాల్‌లోని వెదురు ఉత్పత్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్

విముక్తి కోసమే సాయుధ పోరాటం

భద్రాచలంఅర్బన్: భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసమే తెలంగాణ సాయుధ పోరాటం జరిగిందని భద్రాచలం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అన్నారు. సోమవారం సీపీఎం భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పార్టీ పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు బండారు శరత్ బాబు అధ్యక్షతన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవ సభ జరిగింది. కార్యక్రమంలో స్వామి మాట్లాడుతూ.. కమ్యూనిస్టుల నాయకత్వంలో పేదలు సంఘటితమై దొరలు, భూస్వాములు, జాకీర్దారులు దేశముక్కులు, పటేల్ పట్వారిలు, అరాచకాలకు వ్యతిరేకంగా సాయుధ తిరుగుబాటు సాగిందని ఆయన అన్నారు. వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో 4000 మంది కమ్యూనిస్టులు ప్రాణాలు అర్పించారని, సాయుధ పోరాటానికి వారసులు కమ్యూనిస్టు లేనని అన్నారు. రాబోయే కాలంలో విస్తృతంగా ప్రజా పోరాటాలు వర్గ పోరాటాలు సాధించడమే వీర తెలంగాణ పోరాట యోధులకు మనం ఇచ్చే నివాళి అని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు బండారు శరత్ బాబు, పి.సంతోష్ కుమార్, నాదెళ్ల లీలావతి, పట్టణ కమిటీ సభ్యులు డి.సీతాలక్ష్మి, కోరాడ శ్రీనివాస్, జీవనజ్యోతి, సీహెచ్ మాధవరావు, వుస్తెల జ్యోతి, నాయకులు గౌతమి ఏజే, మచ్చా రమాదేవి, డి.రామకృష్ణ, కాకా రమణ, కనక శ్రీ, గడ్డం, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

మణుగూరుటౌన్: ఆటో క్యాబ్ డ్రైవర్లకు ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా నష్టపోయిన ఆటో కార్మికులకు ఏడాదికి 12వేలు ప్రభుత్వం ఇవ్వాలని, రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయోధ్య, తెలంగాణ రాష్ట్ర ఆటో-క్యాబ్ ఆటో డ్రైవర్స్, అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కంచర్ల జమలయ్య డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో 22, 23 తేదీలలో కొత్తగూడెంలో జరిగే మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ.. సోమవారం సురక్షా బస్టాండ్ వద్ద జీపుజాతా కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ కార్యదర్శి వెంకన్న అధ్యక్షత వహించగా.. అనంతరం వారు మాట్లాడుతూ.. 2019 మోటార్ వాహన చట్టాన్ని రద్దు చేసి ఆటో డ్రైవర్లకు ఇందిరమ్మ ఇల్లు, 60 సంవత్సరాల పెన్షన్లు ఇవ్వాలన్నారు. ఆటో క్యాబ్ మీటర్ చార్జర్ వెంటనే పెంచి మహాలక్ష్మి పథకం ద్వారా నష్టపోయిన ఆటోలకు థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్‌ను రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించి డిమాండ్స్‌ని ప్రభుత్వం పరిష్కారం చేయాలని కోరారు. లక్ష్మీదేవిపల్లిలో 22, 23న వ్యవసాయ మార్కెట్ నుంచి పెద్ద ఎత్తున నిర్వహించే ర్యాలీకి తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సరెడ్డి పుల్లారెడ్డి, దుర్గ్యాల సుధాకర్, సోందె కుటుంబరావు, రాయల భిక్షం, కొత్తపల్లి సీతారాములు, తోట రమేశ్, జక్కుల రాజబాబు, కోటి ఆటో యూనియన్ అధ్యక్షుడు వంక రాములు, రేగల వెంకన్న, బద్రి శ్రీను, ఎండి పాషా తదితరులు ఉన్నారు.

తడి, పొడి చెత్తను వేరుచేయాలి



అశోక్‌నగర్ కాలనీ వాసులకు అవగాహన కల్పిస్తున్న ఐటీసీ వావ్ కోఆర్డినేటర్ రమ్య

భద్రాచలంఅర్బన్: తడి, పొడి చెత్తలను వేరు వేరుగా ఉంచాలని ఐటీసీ వావ్ భద్రాచలం కో-ఆర్డినేటర్ రమ్య తెలిపారు. ఆ తరువాత భద్రాచలం పట్టణంలోని అల్లూరి సీతరామరాజు, అశోక్‌నగర్ కొత్త కాలనీ, ఇతర కాలనీల్లో సోమవారం తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తడి, పొడి చెత్తను వేరుగా పెట్టి ఆ తరువాత వచ్చే పంచాయతి సిబ్బందికి చెత్తను ఇవ్వాలని ఆమె తెలిపారు. చెత్త జమ చేయడానికి ప్రతి ఇంటికి ఇప్పటికే చెత్త బుట్టలను అందించామని, వాటిని సక్రమంగా వినియోగించాలని కాలనీ వాసులకు రమ్య సూచించారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ తడి చెత్తను, పొడి చెత్తలను కలిపి ఒకే బుట్టలో వేయవద్దని ప్రసుత్తం వర్షాలు పడుతున్నందున ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలని ఆమె అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐటీసీ వావ్ ఫీల్డ్ కో-ఆర్డినేటర్ రాజేశ్వరి, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలను పట్టించుకునే వారేరి?

చర్ల: చర్ల మండలంలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలను, నాయకులను పట్టించుకునే నాథుడే కరవయ్యాడని బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం చర్లలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎంపీపీ గీదా కోదండరామయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు నాయకులు, కార్యకర్తలు మాట్లాడారు. పార్టీ కష్ట కాలంలో ఉన్న సందర్భంలో పార్టీ కోసం పని చేసిన వారిని మండల కమిటీ పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తోందని, దీంతో నాయకులు, కార్యకర్తలు ఎదురవుతున్న సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాకుండా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. చర్ల మండలంపై పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు ప్రత్యేక దృష్టి సారించి మండల కమిటీని తక్షణమే రద్దు చేసి కార్యకర్తల కష్టాలను పట్టించుకునే వారిని మండల కమిటీకి ఎంపిక చేయాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు దొడ్డి తాతారావు, ఎస్‌డీ అజీజ్, ఐనవోల్ పవన్‌కుమార్, పొడియం మురళీ, కారం కన్నారావు, కొంబత్తిని రాము, తడికల బుల్లబ్బాయి. రావుల కిశోర్, వేములవాడ కృష్ణార్జునరావు, కేపా గణేష్, కుప్పాల నిరంజన్, ఉబ్బా చంటి, తుర్రం రాజు, తడికల చంద్రశేఖర్, బట్టా కొమరయ్య, గుమ్ముల నరేందర్, కొంగూరు సోమరాజు, గంపల రమేష్, తడికల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు

క్షౌర వృత్తిదారుల దినోత్సవం

ప్రపంచ క్షౌర వృత్తిదారుల దినోత్సవాన్ని సోమవారం నాయీ బ్రాహ్మణులు ఘనంగా నిర్వహించుకున్నారు. కూడళ్ల వద్ద జెండా ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ.. క్షౌర వృత్తిదారులు ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడి ఉన్నారన్నారు. దశాబ్దాలుగా క్షౌర వృత్తినే నమ్ముకున్న వీరిని ఆదుకునేందుకు ప్రభుత్వం ఆర్థిక చేయూతనందించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో పలువురు నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



అశ్వారావుపేటరూరల్: జెండా ఎగుర వేస్తున్న లింగిశెట్టి వెంకటేశ్వరరావు



బూర్గంపాడు: జెండాను ఆవిష్కరిస్తున్న నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు



చంద్రుగొండ: జెండాను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకుడు మల్లేశ్వరరావు